# మనసు చుట్టూ రంగులు

బయట తెరిపి లేకుండా వర్షం పడుతోంది. టైమెంతయిందో తెలిదు. కళ్ళుతెరచి చూస్తే కిటికీలోనుంచి నల్లగా కాటుకలా ఉన్న ఆకాశం కనిపించింది. వెలుతురు కనపడలేదు.

మళ్ళీ కళ్ళు మూతలు పడినాయి. బలవంతాన కళ్ళుతెరిచి ఉంచి కిటికీ బయట కనపడుతున్న వర్షపుధారను చూశాను.

బాగా ఆకలిగా వుంది– భరించలేనంతగా. ఇంతకంటే చావు హాయిగా వుంటుందేమో! అవును. ఎన్నో బాధలకన్నా, సమస్యలకన్నా ఒక్కోసారి చావు హాయైనదిగా వుంటుంది. కాని, చిత్రం. మనిషి ఇక చావు తప్పదనుకున్నప్పుడు కూడా ఏదో విధంగా బ్రతక ప్రయత్నం చేస్తాడు.

భోజనంచేసి ఎన్ని రోజులయింది? గుర్తు చేసుకున్నాను. మూడు రోజులయింది. రెండ్రోజుల క్రితం వండుకోటానికి అన్నీ అయిపోయి ఎప్పటిదో ఎండిపోయిన రొట్టెను తిన్నాను. రెండ్రోజులనుంచి పూర్తిగా నీళ్ళతాగే బతుకుతున్నాను.

ఇప్పుడా నీళ్ళకూడా కుండ అడుక్కుపోయాయి.

నామీద నాకే జాలివేసింది.

నవ్వు కూడా వచ్చింది. ఆ తర్వాత ఉప్పెనలా దుఃఖం ముంచుకు వచ్చింది.

ఉన్నట్టుండి నాకు మూడేళ్ళక్రితం ఓ రైలు ప్రమాదంలో చని ఫోయిన తండ్రి, బతికివున్న తల్లి, అక్కయ్య, చెల్లెలు గుర్తుకువచ్చారు.

వాళ్ళందరూ వుండి నేనిప్పుడు ఒంటరివాడిని. భాగ్యనగరంలో దిక్కులేకుండా ఓ చీకటి గదిలో పగలో, రాత్రో తెలికుండా ఓమూల పడివున్న నిర్భాగ్యుడిని.

నాఒళ్ళు సెగలుకక్కుతోంది. కొలిమిలోనించి తీసిన ఇనుములా మండుతోంది జ్వరం ఇంకా తగ్గలేదు. అవును. ఎలా తగ్గుతుంది? మూడురోజుల క్రితం జ్వరం మొదలయితే గూట్లో ఓమూల దొరికిన ఏదో టాబ్లెట్ ఒకటి మింగేశాను. ఆ రాత్రి తప్పకుండా జ్వరం తగ్గుతుందనే అనుకున్నాను. కాని– దురదృష్టం.... తగ్గలేదు కాని మరింత పెరిగిపోయింది.

ఇంతకీ నేను బతుకుతానా?

ఈ అనుమానం నాకు నిద్రనుంచి మెలకువ వచ్చినప్పుడల్లా వస్తూనే వున్నది. నాకు భయంగానే ఉన్నది. ఈ మూడు రోజుల నించి నేనిలా మూసిన కన్ను తెరవకుండా జ్వరంతో ఆకలి బాధతో నరకాన్ని అనుభవిస్తున్న సంగతి ఎవరికీ తెలియదుకదా!

అవును. ఎవరికీ తెలిదు. భాగ్యనగరంలో నాకు యిద్దరే స్నేహితులు ఉన్నారు. వాళ్ళిద్దరికీ నన్నుచూసే తీరిక ఉండదు. వాళ్ళ ఉద్యోగాలు అలాంటివి. ఎప్పుడయినా నేనే వాళ్ళని కలిసేవాణ్ని.

ఇక మా యింటివాళ్ళు అయిదు రోజుల క్రితం ఏదో ఊరు బంధువుల ఇంటికి వెళ్ళారు.

కాబట్టి ఇక నేను బతికి ఉన్నానోలేదో కూడా ఎవ్వరికీ తెలిసే అవకాశం లేదు.

కళ్ళు ఎంత ప్రయత్నం చేసినా మూసుకుపోతున్నాయి. బాగా దాహంగా వున్నది. కాని లేచి వెళ్ళి తాగే శక్తి నా ఒంట్లోలేదు. అందుకే అలా పడుకుని ఉన్నాను. వర్షం పడుతున్న చప్పుడు వినబడుతూనే ఉన్నది.

ఎలాగో ఈ జ్వరం తగ్గితే ఒకసారి ఇంటికి వెళ్ళాలి. అందరినీ చూసి రావాలి.

అసలు నేను బతుకుతానా?

జ్వరం నన్ను బతకనిస్తుందా?

నా స్థితి చాలా దారుణమైనది. నిజానికి నా దగ్గర ఒక్క-రూపాయికూడా లేదు. మూడురోజుల క్రితమే నా దగ్గరవున్న రెండు రూపాయిలూ ఖర్చు పెట్టేశాను తిండికోసమే.

ఇరవై రోజులక్రితం నాఉద్యోగం పోయింది. నేను వ్యాపారాన్ని అభివృద్ధి పరచ లేకపోయానని చెత్త సిరా కంపెనీ ప్రొప్రయిటరు నన్ను ఉద్యోగంలోంచి తీసేశాడు. నేను ఆ చిన్న కంపెనీలో ఓ నీళ్ళ సిరాకి రిప్రజెంటేటివ్‌గా కొన్నాళ్ళు పనిచేశాను. ఎంత బతిమలాడినా ఆ సిరాకి ఆర్డరు ఇవ్వమంటే ఒప్పుకునే వాళ్ళు కాదు.

ఆ తర్వాత నాకు ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. దొరుకుతుందనే ఆశతోనే వున్నాను. ఉద్యోగం వున్నప్పుడు నేను పొదుపు చేసిన యాభై రూపాయలనూ మూడ్రోజుల క్రితం వరకూ వాడుకు వచ్చాను.

ఇప్పుడు నా గదిలో తింటానికి ఏమీలేదు.

ఇప్పుడు నా గతేమిటి?

మూడ్రోజులకే సగం తగ్గిపోయినట్టు అనిపించింది. అవును. లావు కావడం కష్టమే. సన్నగా అయిపోవటానికి ఎన్ని రోజులు కావాలి ?

పైగా జ్వరం–

కాలేజీలో చదివే రోజుల్లో హాండ్సమ్‌గా ఉండేవాడిని. రోజూ వ్యాయామం చేసేవాడిని. అందమైన అమ్మాయిలందరూ నన్ను గొప్పగా ఆరాధించే వాళ్ళని అనుకునే వాడిని.

ఇలా నేను అనుకోవడమే కాదు. ఓ అమ్మాయితో నేను ప్రేమాయణం సాగించిన తర్వాత ఒకరోజు ఆ అమ్మాయి అన్నది : 'నువ్వు హాండ్సమ్‌గా వుంటావ్. అందుకే నువ్వంటే నాకు ఇష్టం'.

ఆ అమ్మాయే ఇప్పుడు నన్ను చూస్తే కనీసం మాట్లాడటానికే ఒప్పుకోక పోవచ్చు.

అంత వర్షంలోనూ నాకు బాగా దాహంగా వుంది. కాని‹ లేవలేక పోతున్నాను. ఎవరైనా నా గదిలోకి వస్తే బావుండు, వాళ్ళనడిగి నీళ్ళు తాగొచ్చు.

కాని నా గదికి ఎవరొస్తారు?

ఎవరైనా రావాలని అనుకున్నా, ఈ వర్షంలో ఎవ్వరూరారు. నా దురదృష్టానికి తోడు ఈ వర్షం కూడా.

ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు గురించి కలలు కన్నాను. కాని, ఈ క్షణంలో ఇలా....

మా ఇంటివాళ్ళ అమ్మాయి వందన కూడా అప్పుడప్పుడు అంటూనే ఉండేది : 'మీకు తప్పకుండా మంచి ఉద్యోగం వస్తుంది.... అప్పుడు ఈ మునిసిపాలిటీ సిరా కంపెనీకి రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగానికి రిజైన్ చెయ్యొచ్చు' అని.

ఆ అమ్మాయి చాలా సరదగా ఉండేది. అందమైన రూపం. వందనలో అందాన్ని మించిన ఆకర్షణ ఉన్నది. ఆ అమ్మాయిని నేను ఆకర్షించగలుగుతున్నానో, లేదో తెలిసేదికాదు. కానీ ఆ అమ్మాయితో

మాట్లాడేటప్పుడు నాలో గొప్ప ఆవేశం కలిగేది. ఆమెను గాఢంగా కౌగిలించుకోవాలని అనిపించేది. నా గదిలోకి వచ్చి మాట్లాడుతున్న ప్పుడు ఒక్కోసారి తెగించి నాకోరిక బలవంతంగానైనా తీర్చుకోవాలని అనుకునే వాడిని. కాని, ఆ అమ్మాయి చాలా మంచిది. నా మనసులో ఉన్న కుటిలమైన ఆలోచన గురించి తెలిక నవ్వుతూ ఎంతో స్వేచ్ఛగా మాట్లాడేది.

ఇప్పుడా అమ్మాయికూడా తల్లిదండ్రులతో ఊరికి వెళ్ళిపోయింది.

ఎక్కువసేపు మూసుకుని ఉండటంచేత కళ్ళుకూడా నొప్పులుగా ఉన్నాయి.

దాహం బాగా ఎక్కువయింది.

శరీరం కాలిపోతోంది. నా వాళ్ళందరినీ చూడకుండా గదిలో చచ్చిపోతానేమోననే భయం నాలో మొదలయ్యింది.

రేకుల మీదనుంచి నీళ్ళ జారుతున్న చప్పుడు వినబడుతూనే ఉంది.

ఉన్నట్టుండి గది తలుపులు తెరుచుకున్న చప్పుడు.

'ఎవరూ?' అడగాలనుకున్నాను.

కాని ఇంతలోనే వందన గొంతు వినిపించింది.

"ఏమిటీ ? ఈ గదిలో ఉంటున్నది మనుషులేనా? దయ్యాలా? ఇలా చీకట్లో లైట్లులేకుండా ఎలా ఉంటున్నారు?"

లైటు వెలిగింది.

వెలుతురు చూడలేకపోయాను. కళ్ళు తెరవలేక పోయాను.

"మైగాడ్! మీకేమైంది?" ఆమె నాచెయ్యి పట్టుకున్నది. ఆ తర్వాత చిన్నగా కేకపెట్టింది.

"అసలు మీరెలా బతికి ఉన్నారు? ఎన్ని రోజులనుంచి జ్వరం? ఇంకా నయం.... నేను, అమ్మ ఊర్నించి ముందుగా వచ్చేయటం మంచిదే అయ్యింది" అంటూ ఆమె నేనున్న పరిస్థితిని సులభంగానే గ్రహించింది.

"ఉండండి.... ఇప్పుడే వస్తాను" అని చరచరా బయటకు వెళ్ళిపోయింది.

అప్పుడు నాకు నేను బతుకుతాననే ధైర్యం వచ్చింది.

పావుగంటలో వందన బ్రెడ్, రెండు గ్లాసుల హార్లిక్స్, జ్వరం తగ్గటానికి మందు బిళ్ళలు తీసుకుని వచ్చింది.

నన్ను లేవదీసి కూర్చోపెట్టి రెండు టాబ్లెట్లు మింగించి, బ్రెడ్డు కోసి ఇచ్చింది. తర్వాత రెండు గ్లాసుల హార్లిక్స్‌నూ తాగించింది.

ఆమె చేస్తున్న సేవలను చూస్తుంటే నాకు ఏడుపు వచ్చింది.

ఈ మనిషి గురించా నేను ఆవేశపడింది! కుటిలమైన ఆలోచనలను చేసింది?

ఎంత మంచి మనిషి!

నా కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"భలే వారే.... ఇదేనా మీ ధైర్యం. భయపడకండి. మీకేమీ కాదు ఈ జ్వరం రేపటికల్లా తగ్గిపోతుంది. ఇది ప్రస్తుతానికి నా వైద్యమే. ఈ వర్షం తగ్గగానే మిమ్మల్ని డాక్టర్ దగ్గరకు తీసుకు వెళతాను. కొంచెంసేపు రెస్టు తీసుకోండి" అని వందన మళ్ళీ నన్ను పడుకోబెట్టింది.

ఇప్పుడామె నాకెంతో సన్నిహితంగా వచ్చింది. నన్ను పట్టుకున్నది. అయినా వందనను చూస్తుంటే నాలో ఎలాంటి ఆవేశమూ,

కోరికా కలగడంలేదు. వందనలో నాకు మా జానకి కనబడుతోంది.

ఆశ్చర్యం! వందన, నేను– ఆ మనుషులమే. అదే మనసు. కాని పరిస్థితుల ననుసరించి ఆలోచనల్లో ఎంత భేదం?

*

(27-6-1984 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)